క్లుప్తంగా

అదనపు గదుల ప్రారంభం



రోటరీ వృద్ధాశ్రమంలో అదనపు గదులను ప్రారంభిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలెంలోని రోటరీ క్లబ్‌కు చెందిన ఆశ్రయ వృద్ధాశ్రమంలో రోటరీ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు గదులను ఆదివారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ చైర్మన్ జీవీ కృష్ణ ప్రకాష్, ఎస్ఆర్ఎంటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నె సుధీర్ ప్రారంభోత్సవాలు చేశారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు ఎవరైనా అనారోగ్యం బారిన పడితే అదనపు గదులను సిక్ రూమ్‌లుగా వినియోగిస్తారని వారు తెలిపారు. రొటేరియన్ డాక్టర్ రామకృష్ణ, సభ్యులు విశ్వేశ్వరరావు, చిట్ల శ్రీకాంత్, ధనసాగర ప్రసాద్, డాక్టర్ సతీష్, ఉషారాణి, సత్యపాల్, చార్మినర్ వర్మ, సూర్యారావు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు

బోట్‌క్లబ్: యువ వ్యాపారవేత్తలు వారి వ్యాపార అభివృద్ధికి ఏర్పాటు చేసుకున్న లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ (ఎల్‌బీఎన్) సంస్థ మంచి ఫలితాలు ఇస్తుందని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు అన్నారు. స్థానిక హోటల్‌లో ఎల్‌బీఎన్ 3వ వార్షికోత్సవం జరిగింది. యువ వ్యాపారవేత్తలు వారి వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు అసోసియేషన్‌గా ఏర్పడి రిఫరల్స్ ద్వారా వారి వ్యాపారం అభివృద్ధి చేసుకుంటూ సామాజిక సేవల్లో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. ఎల్‌బీఎన్ ఆధ్వర్యంలో జూలై 13 కాకినాడ టౌన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్న రక్తదానం శిబిరం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎల్‌బీఎన్ అధ్యక్షుడు రవితేజ, డైరెక్టర్ అంకూర్ సురానా, సెక్రటరీ ఏవీవీ సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు సిరాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించడం ఆనందదాయకం



శ్రీధర్‌ను సత్కరించిన కైట్ విద్యా సంస్థల ప్రతినిధులు

బోట్‌క్లబ్: తమ వద్ద చదువుకున్న శ్రీధర్ ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం ఆనందంగా ఉందని కైట్ విద్యా సంస్థల చైర్మన్ పోతుల విశ్వం అన్నారు. స్థానికంగా ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థి సరగం శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వం మాట్లాడుతూ శ్రీధర్ 2006లో తమ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడన్నారు. ఒక అమెరికన్ కంపెనీకి వైస్ చైర్మన్‌గా ఉంటూ గడిచిన 19 ఏళ్లుగా ఎంతో మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారన్నారు. అనంతరం శ్రీధర్ ఏ విధంగా ఉన్నత స్థాయికి ఎదిగారో వివరించారు. అనంతరం శ్రీధర్‌ను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిబ్బంది వై.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ క్రికెట్ సంఘ కార్యదర్శికి డాక్టరేట్



కిరణ్‌రాజుకు డాక్టరేట్ అందిస్తున్న ప్రతినిధులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తమిళనాడులోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ కాకినాడకు చెందిన మాజీ క్రికెట్ సంఘ కార్యదర్శి, సంఘ సేవకుడు కటారి శ్రీనివాస్ కిరణ్‌రాజుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సోషల్ సర్వీసెస్ కేటగిరీలో కిరణ్‌రాజు అందిస్తున్న సేవలు గుర్తించి ఈ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. శనివారం తమిళనాడులో జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో కిరణ్‌రాజుకు ఈ పట్టాను యూనివర్సిటీ అధికారులు ప్రదానం చేశారు. ఐడియల్ పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కిరణ్‌రాజు క్రికెట్ సంఘానికి ఆరేళ్లు కార్యదర్శిగా సేవలు అందించారు. ఆయన్ని నగరంలోని పలువురు అభినందించారు.

చరిత్ర క్లీన్‌బౌల్డ్

- రెండుగా తూర్పు గోదావరి క్రికెట్ సంఘం
- ఇప్పటికే రెండో వర్గం ఎన్నికల నిర్వహణ
- ఆగస్టుతో ముగియనున్న ప్రస్తుత సంఘ కాల పరిమితి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సుమారు ఐదున్నర దశాబ్దాల ఘన చరిత్ర... ఎందరో క్రికెటర్లను రంజీ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లుగా తీర్చిన దిద్దిన సంఘం చీలిపోయింది. జిల్లా వాసులకు అందని ద్రాక్షగా మిగిలిన క్రికెట్ స్టేడియం నిర్మాణం చేపట్టే సమయం దాదాపు చివరి దశకు చేరుకున్న తరుణంలో ఊహించని రీతితో తూర్పుగోదావరి క్రికెట్ సంఘం రెండుగా విడిపోయింది. అయితే రెండు సంఘాల్లో ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) ఎవరిని గుర్తిస్తుందనేది చర్చనీయాంశం అయ్యింది.

ఎప్పుడు ఆవిర్భావం అంటే..

తూర్పుగోదావరి జిల్లాలో క్రికెట్ సంఘం 1968లో ఏర్పడింది. పూర్తి స్థాయి గుర్తింపు పొందిన సంఘంగా 1975లో ఆవిర్భవించింది. సంఘానికి తొలి అధ్యక్షుడిగా డీవీ రామారావు, కార్యదర్శిగా ఎస్ఎంఎస్ రామచంద్రరాజు, ఉపాధ్యక్షుడిగా గోపన్న కొమ్మిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కేటీ మ్యాథ్యూస్, ప్రభాకరరావు వ్యవహరించారు. 1975 నుంచి 2003 వరకూ జిల్లా క్రికెట్ సంఘానికి కార్యాలయం అంటూ లేదు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శిక్షణ ఇచ్చేవారు. 2003లో అప్పటి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఏంపదీన్ సహాయంతో జిల్లా క్రీడా మైదానంలో కార్యాలయం ఏర్పాటైంది. అక్కడే ప్రాక్టీస్ చేసేవారు. 2008లో రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానానికి మారింది. అక్కడే క్రికెట్ నెట్స్, పిచ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడే శిక్షణ అందిస్తున్నారు.

ప్రస్తుత క్రికెట్ సంఘం

సంఘం ఏర్పడిన నాటి నుంచి ప్రతి మూడేళ్లకు నూతన సంఘం ఏర్పడుతూ వచ్చింది. అయితే ప్రస్తుతం మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటైన సంఘానికి డాక్టర్ శివకుమార్ అధ్యక్షుడిగా, పసుపులేటి సత్యనారాయణ కార్యదర్శిగా, నక్కా వెంకటేష్ కోశాధికారిగా ఉన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 10, 12, 14, 16, 19, 22, 25, మెన్, వుమెన్‌కు శిక్షణ అందిస్తున్నారు. కాకినాడ, పెద్దాపురం, కోనసీమ అంబాజీపేటలో సెంటర్లు నిర్వహిస్తున్నారు.

జిల్లా నుంచి రంజీ కెప్టెన్లుగా...

జిల్లా నుంచి ఆంధ్రా రంజీ జట్టుకు కొమ్మిరెడ్డి గోపన్న, ఎంఎస్ రవికుమార్, కేవీఎస్ భాస్కర్ రామ్మూర్తి, కేవీఎస్‌డీ కామరాజు, డి.మెహర్‌బాబాలు కెప్టెన్లుగా వ్యవహరించారు. అండర్–23 విభాగంలో ఆంధ్రా కెప్టెన్‌గా శ్రీకాంత్, అండర్–19లో కార్తీక్ రామన్, ఎస్.యురీష్, అండర్–16లో ఎస్.తరుణ్ ఉన్నారు. గతంలో ఏసీఏ (ఆంధ్రా క్రికెట్ సంఘం) రూ.11 లక్షల వార్షిక నిధులు క్రికెట్ సంఘ కార్యకలాపాలు, జీతాల నిమిత్తం అందజేసేది. గత మూడేళ్ల నుంచి సంవత్సరానికి రూ.20 లక్షల నిధులు అందిస్తుంది. వచ్చే ఏడాది నుంచి రూ.40 నిధులు అందించాలనే ఆలోచనలో ఏసీఏ ఉన్నట్లు క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.



రంగాయ వైద్య కళాశాల మైదానంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ మైదానం

విడిపోయేందుకు కారణాలు ఇవేనా?

ప్రస్తుత క్రికెట్ సంఘంలో కొందరు ఎప్పటి నుంచో సేవలు అందిస్తున్న శాశ్వత సభ్యులు ఉన్నారు. లోథ కమిటీ సిఫార్సుల ప్రకారం వారిని దూరం పెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లోథ కమిటీ ప్రకారం కొత్త శాశ్వత సభ్యత్వాలు ఇవ్వకూడదని, పాత శాశ్వత సభ్యత్వాలు సంఘం ఉన్నత కాలం, లేదా సభ్యులు మరణించే వరకూ కొనసాగించాలని సీనియర్ క్రికెట్ సంఘ సభ్యులు చెబుతున్నారు. సంఘంలో మొత్తం 65 మంది సభ్యులు ఉండగా, అందరితో కాకుండా కొందరు మాత్రమే ఏకపక్షంగా కార్యకలాపాలు కొనసాగించడంపై వారి పద్ధతులు నచ్చని వారు రెండో సంఘంగా ఏర్పడ్డారనే వాదన వినిపిస్తుంది. రెండో సంఘం ఇటీవల ఎన్నికలు నిర్వహించుకుని తమ జాబితాను ఏసీఏకు సమర్పించింది. ప్రస్తుత సంఘ కాల పరిమితి ఆగస్టుతో ముగుస్తుంది. అయితే ఏసీఏకు కార్యదర్శిగా కాకినాడకు చెందిన ఎంపీ, మాజీ క్రికెట్ సంఘ కార్యదర్శి సానా సతీష్‌బాబు వ్యవహరిస్తుండడంతో ఏసీఏ తిరిగి ప్రస్తుతం ఉన్న సంఘానికి ఎన్నికలు జరుపుకోమని అనుమతి ఇస్తుందా, రెండో వర్గానికి గుర్తింపు ఇస్తుందా అనే దానిపై సందిగ్ధం నెలకొంది. ఏదేమైనా జిల్లాకు అందని ద్రాక్షగా మిగిలిన క్రికెట్ స్టేడియం నిర్మాణం దాదాపు ఖరారు కానున్న సమయంలో రెండు సంఘాలుగా విడిపోవడం ఒకింత నిరాశ కలిగించిందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.

లోకహితం కోసం వారాహి హోమాలు

బోట్‌క్లబ్: వారాహి నవరాత్రుల సందర్భంగా వేద విజ్ఞాన ప్రతిష్ఠానం, అఖిల భారత జ్యోతిష సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలోని ప్రతిష్ఠాన కార్యాలయంలో ఆదివారం వారాహి హోమాలను వేద పండితుడు దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. లోకహితంతో పాటు ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవనం సాగించాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రతి ఏడాది క్రమం తప్పకుండా వారాహి నవరాత్రులను నిర్వహిస్తున్నామని జ్యోతిష పండితుడు ఫణిశర్మ అన్నారు.

విజయవంతంగా మొక్కలు నాటే కార్యక్రమం



సూర్యారావుపేట బీచ్‌లో మొక్క నాటుతున్న ఆల్ ఈజ్ వెల్ సభ్యులు

కాకినాడ రూరల్: ఆల్ ఈజ్ వెల్ పేరుతోనే సేవా కార్యక్రమాలు చేపట్టిన కాకినాడ, ఇంద్రపాలెం గ్రామాలకు చెందిన పలువురు హరిత కాకినాడ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ రూరల్ బీచ్‌లో వెయ్యి కొబ్బరి మొక్కల నాటే కార్యక్రమాన్ని ఆదివారంతో విజయవంతంగా పూర్తి చేశారు. బీచ్‌లోని ఖాళీ స్థలంలో పర్యావరణ హితం కోరుతూ వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని, ఆదివారం 250 మొక్కలు నాటడం ద్వారా తమ మహా సంకల్పం నెరవేరిందని ఆల్ ఈజ్ వెల్ సంస్థ వ్యవస్థాపకుడు కిశోర్ వెల్లడించారు. ఇందుకు అధికారులు, గ్రీన్ కో సంస్థ సహకారం అందించిందన్నారు. కాకినాడ ఐడీఏ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, టీవీఎస్ఎన్ రెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, కర్రి శ్రీనివాస్, వినోద్, వెంకట నారాయణ, చక్రధర్, కమలాకర్, రాజేంద్ర రెడ్డి, అనంతలక్ష్మి, డాక్టర్ చిట్ల కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికలో గణాంకశాస్త్రం కీలకం

బాలాజీచెరువు: ఆర్థిక ప్రణాళిక రూపకల్పనలో గణాంకశాస్త్రం కీలక భూమిక పోషిస్తుందని ఆదిత్య డిగ్రీ కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం భారత గణాంకశాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ జి.ఫణిపవన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గణాంక విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మరో అతిథి జేఎస్ఓ పీవీఎస్ నరసింహరాజు మాట్లాడుతూ గణాంకశాస్త్రాన్ని అధ్యాయనం చేయడం ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు వస్తాయని, తద్వారా పరిశోధకులుగా తయారు కావాలన్నారు. అనంతరం అతిథులను సత్కరించగా కళాశాల ప్రిన్సిపాల్ కరుణ గణాంకశాస్త్రాన్ని పరిశోధనలో వినియోగించే అంశాన్ని వివరించారు. గణాంకశాస్త్ర విభాగాధిపతి రాజరాజేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీకాంత్ పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కరుణ

నేత్రపర్వంగా బోనాల సంబరం



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



నవరలో అమ్మవారి బోనంతో సర్పంచ్ తదితరులు

సామర్లకోట: మండల పరిధిలోని నవర గ్రామంలో వేంచేసి ఉన్న ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి బోనాల సంబరం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు, ఆలయ ధర్మకర్త దమ్మాల లక్ష్మణరావు, వీరనాగమణి దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. గరగలు, వీరభద్రుని నృత్యం, బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య బోనాల సంబరం గ్రామం అంతా పర్యటిస్తూ సాగింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి సర్పంచ్ దంపతులు బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం, చవితిని పురస్కరించుకుని ఈ సంబరం నిర్వహించామని సర్పంచ్ లక్ష్మణరావు చెప్పారు. వందలాది మంది మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకను తిలకించడానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శివసుబ్రహ్మణ్యం పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు.

తీరం... శిథిల సాక్ష్యం



తీరంలో కోతకు గురవుతున్న మత్స్యకారుల ఇళ్లు



సముద్ర గర్భంలో కలుస్తున్న సీసీ రోడ్డు

కొత్తపల్లి: శిథిల భవనాలు.. కొట్టుకుపోయిన రోడ్లు.. అక్కడ చూస్తే భూకంపాన్ని తలపిస్తోంది. ఉప్పాడ తీరానికి నానాటికీ రక్షణ లేకపోయింది. ఈ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు నిర్మించిన జియోట్యూబ్ (రక్షణగోడ) పూర్తిగా సముద్ర గర్భంలో కలసిపోయింది. ఇక్కడ మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నో భారీ తుపాన్లు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లను ఈ రక్షణ గోడ ఎదుర్కొంది. ఇప్పుడు ఇది పూర్తిగా కనుమరుగైంది. తుపాన్లు వచ్చినప్పుడల్లా ఆస్తులు కోతకు గురికావడం, అధికారులు వచ్చి మత్స్యకారులకు హామీలివ్వడం పరిపాటిగానే మారింది. తీరప్రాంతం రక్షణకు శాశ్వత పరిష్కారం చేపట్టపోతే భవిష్యత్తులో ఉప్పాడ గ్రామం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడి తీర ప్రాంతం కిలోమీటర్ల మేర కోతకు గురవడంతో పాటు, రూ.కోట్ల విలువైన ఆస్తులు, భూములు, ప్రభుత్వ భవనాలు కడలిలో కలిసిపోయాయి.

వైఎస్ హయాంలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మాజీ కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి ఎంఎం పళ్లంరాజు చొరవతో సుమారు రూ.12 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంతంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రక్షణగోడ నిర్మించారు. అనేక తుపాన్లతో పాటు విలయం సృష్టించిన హుద్‌హుద్ తుపాన్ నుంచి ఉప్పాడ తీరప్రాంతం కోతకు గురికాకుండా రక్షణగోడగా నిలిచింది. ఇప్పుడు అది సముద్రంలో కలసి పోయింది.

విద్యార్థులకు పరుపుల పంపిణీ



హాస్టల్‌కు పరుపులు అందిస్తున్న రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక గాంధీనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ పరుపులను ఆదివారం అందించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ సీపోర్ట్సు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ హాస్టల్ విద్యార్థులకు పరుపులు అందించడం హర్షనీయమన్నారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీకృష్ణవర్మ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు పరుపులు అవసరం ఉందని సూపరింటెండెంట్ తమ్మన్నదొర ద్వారా తెలుసుకుని, రూ.లక్షతో కొనుగోలు చేసి తమ క్లబ్ తరఫున అందించామన్నారు. క్లబ్ సభ్యుడు వి.శ్రీనివాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ప్రసాద్‌బాబు, శేషుకుమార్, సభ్యులు సాయి సుందర్, ఆశా, విజయలక్ష్మి, నగధర్, రుత్విక్ బాలాజీ, హరిప్రసాద్, నంద కిశోరుడు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

కాకినాడ సిటీ: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ నిర్వహిస్తామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు మండల స్థాయి అధికారులు విధిగా ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. లేకుంటే 1100 నంబర్‌కు నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పద మృతి



లాడ్జిలో మంచంపై విగతజీవిగా లోకనాథ్

ఆరిలోవ: విశాఖపట్నం ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్నేహితులతో కలసి కొంత సమయం గడిపిన తర్వాత అతను మరణించినట్లు తెలుస్తోంది. ఎస్ఐ రాందాస్ తెలిపిన వివరాలివి.. కాకినాడకు చెందిన కుక్కల లోకనాథ్ (34) ఎంవీపీ కాలనీలోని సోషల్ వెల్ఫేర్ ఆఫీసులో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య కూడా సోషల్ వెల్ఫేర్ ఆఫీసులో కాంట్రాక్టు పద్ధతిలో అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేటలో ఉద్యోగం చేస్తోంది. అతని అత్తగారిల్లు నగరంలోని దసపల్లా ప్రాంతంలో ఉంది. వారాంతంలో వారు నగరంలోని అత్తవారింటికి వస్తుంటారు. సోషల్ వెల్ఫేర్ విభాగంలో జరుగుతున్న బదిలీలకు సంబంధించి లోకనాథ్ మరో నలుగురు స్నేహితులతో కలసి శనివారం నగరానికి వచ్చాడు. హనుమంతవాక వద్ద పారామౌంట్ లాడ్జిలో వారంతా రూమ్ తీసుకున్నారు. ఆదివారం అందరూ కలిసి డ్యూటీకి వెళ్లాల్సి ఉండగా.. లోకనాథ్ 'ఒంట్లో బాలేదు.. కొంతసేపు ఉండి వస్తాను'అని మిగిలిన స్నేహితులకు చెప్పాడు. దీంతో మిగిలిన నలుగురు స్నేహితులు లాడ్జి నుంచి బయలుదేరి డ్యూటీకి వెళ్లిపోయారు. కొంతసేపటికి లోకనాథ్ రూమ్ నుంచి బయటకు వచ్చి 'కడుపులో మంటగా ఉంది'అని ఓ షాపులో గ్యాస్ట్రిక్‌కు సంబంధించిన ప్యాకెట్ కొన్నాడు. తిరిగి రూమ్‌కి వెళ్లిపోయాడు. 'కడుపు నొప్పిగా ఉంది, కొంత సేపటి తర్వాత వస్తాను'అని ఆఫీసు హెడ్‌కు ఫోన్‌లో చెప్పాడు. ఎంతసేపటికీ లోకనాథ్ డ్యూటీకి రాకపోవడంతో తోటి ఉద్యోగులు మళ్లీ ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో లాడ్జి నిర్వాహకులకు ఫోన్ చేసి చెప్పగా.. స్పందించిన సిబ్బంది రూమ్ తలుపులు తెరిచి చూసేసరికి మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. లాడ్జి నిర్వాహకులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ రాందాస్, సిబ్బంది అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

కరప: గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం కాగా, ఆమె ఆచూకీని మూడు వారాల తర్వాత పోలీసులు కనుగొన్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కిడ్నాప్ చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కరప గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుమార్తె ఈ నెల 8న స్నేహితురాలి బర్త్ డే ఫంక్షన్‌కు అని చెప్పి, బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించకపోవడంతో బాలిక అదృశ్యంపై కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేశారు. చాలారోజులైనా తమ కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి ఎస్పీ బిందుమాధవ్, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు బాధిత తల్లిదండ్రులు ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో ఎస్పీ స్పందించి దర్యాప్తు కోసం మూడు టీములను నియమించారు. తిమ్మాపురం ఎస్ఐ గణేష్, కరప స్టేషన్ కానిస్టేబుల్ శివ బృందం గాలింపులో హిందూపురం సమీపంలో బాలిక, నిందితుడు బుద్దాల మణికంఠ కనిపించారు. నిందితుడు పరార్ కాగా సదరు బాలికను ఆదివారం కరప పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.సునీత తెలిపారు.